
# జీవనది

ఆంధ్రభూమి మంత్లీ.. జూలై 2002



'కాలం ఓ ఇంద్రజాలం!

చేతుల్లో చిక్కినట్టే చిక్కి పాదరసంలా జారిపోతుంటుంది. నేడులన్నీ నిన్నలవుతాయి. రేపులన్నీ నేడులవుతాయి. క్షణాలు గమ్మత్తుగా జారి జారి చివరికి జ్ఞాపకాలుగా సాక్షాత్కరిస్తాయి.'

రైలు 'నిడదవోలు' స్టేషన్ వదిలి నెమ్మదిగా వేగాన్ని పుంజుకుంటుంటే ఋష్యిక్ మనసు మయూరంలా పురివిప్పుకుని మధురానుభూతుల్ని చవిచూస్తోంది. ఎంతో అవినాభావ సంబంధమున్న ఆ ప్రాంతాల్ని వదిలి పుష్కరకాలం దాటుతున్న తనకి– అన్నీ గుర్తే! రాజమండ్రికి దగ్గరవుతున్నానన్న ఊహ మనసును చిరుగాలిలా స్పృశించడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

అక్కడ సిటిఆర్ఐకి ఆఫీసు పనిమీద చాలాకాలం తరువాత వస్తున్నాడు. అతని హృదయం అంతా తన్మయి మీదే కేంద్రీకృతమై ఉంది. ఆమె ఉండేది ఈ రాజమహేంద్రిలోనే. ఎక్కడో ఏ దానవాయి పేటలోనో, జాంపేటలోనో! ఇప్పుడు ఆమె జీవితం ఆమెది. కానీ, ఎప్పుడూ ఆమెతోటి మధురమైన ఊహలు వెంటాడి తన తనువుకు తీయదనాన్ని కలిగిస్తూనే ఉంటాయి.

ఒక్కసారి హఠాత్తుగా తన జీవితం అంతా వృథా అన్నట్లు, పొందవలసింది ఇంకేదీ లేదన్నట్లు అనిపించసాగింది బుష్విక్‌కి.

ఏముంది తనకి? ఎక్కడో బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. రోజులు గడిచిపోతున్నాయి. వయసు మళ్లకుండా ఎవర్నో పెళ్ళిచేసుకున్నాడు, పిల్లలు పుట్టారు. తన ఆలోచనలకు, అనుభూతులకు అవకాశం లేకుండా జీవితం కాస్తా కలలా కరిగిపోతోంది. మరికొన్ని సంవత్సరాలకి వార్ధక్యం సంతరించుకుని, నెరిసిపోయిన జుట్టుతో పెద్దరికాన్ని సంతరించుకుని, కన్న సంతానాన్ని గురించి కబుర్లు చెప్పుకోవాలి. అంతకంటే ఇంకేం మిగులుతుంది?

మనిషన్న ప్రతివాడికి బాల్యం సంతోషంగా గడిచినా, గడవకపోయినా యవ్వనంలో కొన్ని అనుభూతులు చిరస్మరణీయంగా మనసులో ముద్ర వేసుకునేంతటి బలమైన సంఘటనలు లభించాలి. అవి గుర్తొస్తే వెన్నెల్లో కూర్చున్నట్లు, సెలయేటి సంగీతం వింటున్నట్లు... వయసు మర్చిపోయి మళ్లీ ఆ క్షణాల్లో జీవిస్తున్నట్లు అనిపించేలా ఉండాలిగానీ- గుర్తొస్తేనే ఒళ్ళు జలదరించేటట్లు, మనసు ఏవగింపుతో ముడుచుకుపోయేటట్టు ఉండకూడదు. యవ్వనంలో లభించిన అందమైన ఆ అనుభవాల తాలూకు స్మృతులు వార్ధక్యంలో మనిషికి 'జీవిత చరమాంకంలో ప్రవేశించాం. జీవితం ముగించుకున్నాం!' అనే సంగతి గుర్తుకు రానీయకుండా, ఒకవేళ వచ్చినా 'అయిపోయినా చాలు- ఈ జన్మకి ఈ అనుభూతులు చాలు, ఈ తృప్తి చాలు నాకు!' అనుకునేటట్లు ఉండాలి, ఉండి తీరాలి."

తన ఈ అనుభూతులకు ఆలంబన... తన్మయి!

ఎప్పుడో పుష్కర కాలంనాటి తమ స్నేహం గుండెలో సజీవంగా నిలిచి ఉందంటే కారణం... ప్రేమ పట్ల ఆమెకున్న కమిట్‌మెంట్! స్నేహబంధాన్ని సజావుగా నిర్మించిన తన్మయిని తన జీవితకాలంలో మరచిపోగలడా? నెవ్వర్!

ఊహ తెలుస్తున్న తొలినాళ్ల నుండీ మనసులో ఉవ్వెత్తున ఎగిసిపడే భావతరంగాలను, ఆలోచనలను అదిమి పెట్టుకోలేక భావసంఘర్షణకు లోనయ్యేవాడు బుష్విక్. వాటిని తన మనసెరిగిన మనిషితో కలసి పంచుకోవాలని తపనగా ఉండేది. కానీ, వరద గోదారిలా కట్ట తెంచుకొస్తున్న అతనిలోని అల సంపుటి ఎదుటివారి హేళనలతో ఉవ్వెత్తున ఎగసి నేలకొరిగిన ఏటిలోని కెరటం చందంగా ఉండేది. ఆ క్షణంలో 'నేనున్నా'నని బుష్విక్ హృదయపుటద్దంలోకి తొంగిచూసింది తన్మయి!

● ● ●

ఆ కార్తీకమాస వన సమారాధన కార్యక్రమంలో అప్పుడే కొత్తగా అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో చేరిన బుష్విక్‌కి వీరవాసరం గ్రామంలో పోస్టింగ్ ఇవ్వడంతో అక్కడికి వచ్చాడు.

ఊరు కొత్తయినా తెలిసున్న ఒకరిద్దరి ఆహ్వానంతో 'గార్డెన్ పార్టీ'కి తనూ హాజరయ్యాడు.

"సార్! తంబోలా టిక్కెట్ తీసుకోండి సార్!"

అసలే ఊరికి కొత్త! ఎవరూ పరిచయం లేని బుష్విక్ ఒకప్రక్కగా కూర్చుని పేపరు చదువుకుంటుంటే- తేనెలూరు తియ్యని పలుకు కమ్మగా పలికింది.

తనను కాదనుకుంటూనే తల ఎత్తి చూసేసరికి- ఎదురుగా చక్కని చుక్క అందమైన ఆ నవ్వుతో కార్తీకమాసానికి కళ వచ్చినట్లయింది. పరిచయంలేని ఆ దరహాసంతో ఒక్కసారి ఊపిరి తీసుకోవడం మరచిపోయాడు. లాలనగా ఆమె కళ్ళలోకి చూశాడు. ఏ భావనా లేని నయనాలు వింతగా మెరుస్తున్నాయి. బిస్కెట్ కలర్ పట్టులంగా, జాకెట్‌లపై ఎర్రటి మ్యాచింగ్ ఓణీ ధరించిన ఆమె- అక్కడి వారందరిలో ఆకర్షణగా కనిపిస్తోంది. తలారా స్నానం చేసిన ఆ వాలుజడలోని ముద్దమందారం మందహాసాన్ని కలుగజేస్తోంది. ఆమెను చూసిన ఆ క్షణంలో ఎందుకో బుష్విక్ మనసులోనుండి 'నేను ఒంటరి' అన్న భావం తుడిచిపెట్టుకుపోయింది.

"లేదండీ! నాకు గ్యాంబ్లింగ్ ఆటల్లో ఇంతవరకూ ఎప్పుడూ కలిసిరాలేదు. ఈ తంబూలా ఆట అసలే అచ్చిరాదు" ఒకింత విముఖత ప్రదర్శించాడు.

చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో 'కనీసం... నాకోసమైనా మీరు టిక్కెట్స్ కొనాలి!' అనే భావన ద్యోతకమయింది.

"నమ్మండి... అసలు నాకు ఏ ఆటలోనూ కలిసిరాదు. నిజం చెప్పాలంటే- నేను ఇంతవరకూ ఓటు వేసిన ఏ అభ్యర్థి ఎలక్షన్లో నెగ్గలేదు" ఆమె కళ్ళల్లోకి చూశాడు కవ్వింపుగా.

"నేనిస్తున్నా... తీసుకోండి. ఈసారి ఫస్ట్‌హౌస్ మీదే!" అందాల్ని సంతరించుకున్న అతివ అందంగా కోరేసరికి తీసుకోక తప్పలేదు.

"తప్పనిసరిగా ఫస్ట్‌హౌస్ మీదే... నా మాటకు తిరుగుండదు!"

"ఎంత?"

"టిక్కెట్ టెన్ రుపీస్! తరువాత మీ ఇష్టం!" అంటూనే పది టిక్కెట్స్ బుక్‌లోంచి చించింది.

వంద రూపాయలు ఇవ్వక తప్పలేదు బుష్విక్‌కి.

"ఏమే... తన్మయీ! తాతయ్యకి టిక్కెట్ ఇచ్చావా, లేదా?" దూరంగా ఉసిరిచెట్టు కింద చాపపై కూర్చున్న ముదుసలి పిలవడంతో-

"ఇవ్వలేదు బామ్మా! ఇదిగో... వస్తున్నా! థాంక్యూ సార్... ఆల్ ది బెస్ట్!"

ఒక్కసారి అటూఇటూ పరికించి, ఎవరూ తనను గమనించలేదని నిర్ధారించుకుని ఆ టిక్కెట్స్‌ని తన కోమలమైన పెదాలతో ముచ్చటగా చుంబించి బుష్విక్ చేతిలో పెట్టి, తుర్రుమని జారుకుంది తూనీగలా.

'తనలో భావవీచికను వీచి తన్మయుణ్ణి చేసిన ఈ అమ్మాయి పేరు తన్మయా? ఎంత మధురం..!' చేతిలోని టిక్కెట్స్‌ని తనివితీరా చూసుకున్నాడు.

తన్మయి అన్నట్లుగానే సెకండ్ లైన్ ఐదువందలు, ఫస్ట్‌హౌస్ పదిహేను వందలు కలిపి మొత్తం రెండువేల రూపాయలు సాధించాడు బుష్విక్.

భోజనాల అనంతరం పాటల పోటీ ఏర్పాటుచేశారు. దానికి బుష్విక్ ఒక జడ్జిగా వ్యవహరించాడు. ఎందరో వచ్చి ఏవేవో పాటలు పాడి వెళ్లారు. అందరిలోనూ తన్మయి పాడిన 'మాటల కందని భావాలు మంచిమనసులు చెబుతాయి...' పాట జడ్జిలతో పాటు ప్రేక్షకులను కూడా తన్మయుల్ని చేసింది.

ముక్తకంఠంతో ఆమెను విజేతగా ప్రకటించడం ఋష్వీక్‌ని ఆనంద పరవశుడ్ని చేసింది. ఇరవైనాలుగు సంవత్సరాల అజానుబాహుడు, హాండ్సమ్ పర్సనాలిటీగల అతని ఊహలు మాటల కందని ఆమె మంచిమనసుని మననం చేసుకోసాగాయి.

"మా ఇల్లు మీ ఆఫీసు ప్రక్క స్ట్రీట్‌లోనే ఉంది. సాయంత్రాలు వస్తూ ఉండండి."

ఆరోజు ఆమె ఆహ్వానం ఋష్వీక్‌లో భావసంచలనానికి ఊపిరి లూదినట్టయింది.

ఆ ఇంట్లో ఉండేది తన్మయి, ఆమె తల్లి ప్రమీలాదేవి! ఆవిడ చిన్న టైప్ ఇన్‌స్టిట్యూట్ మెయిన్‌టైన్ చేస్తోంది. భర్త తమను వదిలి దేశాంతరాలకు వెళ్ళిపోవడంతో- అన్ని బాధ్యతలు ఆమెపై పడ్డాయి. మగదిక్కు లేని ఇంట్లో తన్మయి మగరాయుడిలా పెరిగినా ఆవిడ ఎప్పుడూ వారించలేదు. కల్మషం లేని తన్మయి అందరితో చక్కగా నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుతూ అమ్మ బాధ్యతల్ని కొంతవరకైనా తాను మోయాలని ఆరాటపడేది.

అసలే బ్యాచిలర్ ఉద్యోగి! వయసు- ఆరాటాన్ని ఉధృతం చేస్తుంటే, తలపులు తనువును తట్టి లేపుతున్నాయి.

మది మందిరంలో మెరుపులా మెరిసే పడుచుదాని చెదరని దరహాసం- తనకీ ఓ మనసుందనే విషయాన్ని తేటతెల్లం చేసింది ఋష్వీక్‌కి.

తన్మయి అపు'రూపం', విలక్షణమైన వ్యక్తిత్వం తనను ఎంతో ఆకట్టుకుని ఎక్కడికో తీసుకుపోతూంటే ఆనందానుభూతితో ఓలలాడేది అతని అంతరంగం.

"ఋషీ! నీలో 'షీ' నేనైతే ఎంత బావుండు!'

విప్పారిన నేత్రాలతో వినమ్రంగా పలికేసరికి- అతని ఆపాదమస్తకం ఆనందంతో పరవశించేది. ఆ సమయంలో మనసు నయాగరా జలపాతంలా తుషారనాదాన్ని ఆలపిస్తున్నట్లు అతని నోట మాట కరువైంది.

"నువ్వు నిజంగా ఋషివయితే అదెలా సాధ్యం?"

"ఋషులకు తపస్సు ఒక్కటే పరమావధి కాదు. లోక కళ్యాణం కూడా వారి ఆశయంలో ఒక భాగమే!"

"నీ లోకం ఏమిటో..?"

"ఎదురుగా చిరునవ్వుల వెన్నెల్ని కాయించే చినదాన్ని పెట్టుకుని మనిషి మరోలోకం కోసం ఆలోచిస్తాడంటావా?"

"రియల్లీ!"

"మన మాటలు మీ అమ్మగారు వింటే నన్ను ఇక మీ ఇంటి గడప తొక్కనీయరు."

"ఇంటి గడప తొక్కకపోయినా తన్మయికి ఆలంబన ఇక నీవేగా!"

"అమ్మ భయం బొత్తిగా లేనట్లుంది!"

"లేదు బాబూ... దాని వరసే అంత! 'ఇది మాట్లాడవచ్చు, మాట్లాడకూడదు' అనేది తెలియదు. ఆయన మాకు దూరంకావడంతో గారాబం చేసేసరికి అది ఇలా తయారయింది!" కాఫీ తెచ్చి ఇచ్చిన ప్రమీలమ్మగారు పలికేసరికి-

"ఏం ఫర్వాలేదండీ! తన్మయి మంచి అమ్మాయి. నిజం చెప్పాలంటే ఆమెను చేసుకో బోయేవాడు చాలా అదృష్టవంతుడు!"

"ఆ అదృష్టవంతుడివి నువ్వే కావచ్చుగా!" చిన్నగా పలికి, చివాలున పక్కగదిలోకి పరుగుతీసింది.

'అమ్మాయి మాటల్ని పట్టించుకోకు బుష్విక్... అదంతే! దాన్ని ఓ అయ్య చేతిలో పెట్టేస్తే నా బాధ్యత కాస్తా తీరిపోతుంది!" గంభీరంగా అంటున్న ఆవిడ మాటల్లో ఒకింత ఆత్రుత కన్పించింది.

వీరవాసరం అగ్రికల్చర్ యార్డు ఇన్‌ఛార్జి అయిన బుష్విక్– నెమ్మదిగా 'ప్రమీలమ్మగారి ఇంటిలో ఒకడు' అన్న స్థాయిని సంపాదించాడు.

గోదావరి పుష్కరాలకి ప్రమీలమ్మ, తన్మయిలతో రాజమండ్రికి బయలుదేరాడు బుష్విక్.

గోదావరి అంటే అతనికి ఎంతో ఇష్టం!

చిన్నతనంలో బ్రిడ్జిమీద రైలు పరుగులు తీస్తుంటే ప్రయాణికులు చిల్లర పైసలు నదిలో వేసి దణ్ణం పెట్టడం వింతగా అన్పించేది. మరికొంతమంది అయితే మరీనూ! కొబ్బరిబోండాం, బియ్యం, అరటిపళ్ళు, దక్షిణ– రైల్లోంచే గోదావరిలోకి విసిరి విశ్వాసాన్ని ప్రకటిస్తే... కింద నదిలో జాలర్లు అవి పట్టుకోవడానికి ఒకరికొకరు పోటీ పడుతూండడం వింత గొలిపేది.

అప్పుడు నాన్న డబ్బులిచ్చి, నదిలో పడేసి దణ్ణం పెట్టమనేవాడు.

'ఆ పావలాతో బిస్కెట్లు కొనుక్కోవచ్చు గదా... ఎందుకు నీటిలో వేయడం?!' అని జేబులో దాచుకునేవాడు తను.

కాలక్రమంలో తెలిసింది– కోస్తావాసుల జీవనాధారం గోదావరి నీళ్లనీ, గంగమ్మ అక్కడి భూముల్ని పునీతం చేసి బీడువారిన ప్రదేశాల్ని సస్యశ్యామలం చేస్తోందనీ! అప్పటినుండి బుష్విక్‌లో 'గోదావరి' అంటే ఎంతో భక్తి భావం! పుష్కరాలలో వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తరిస్తుంటే... అతని తలపులు తన్మయి చుట్టూ తిరుగుతున్నాయి.

అలసినప్పుడు ఆలనగా మధురమైన మాటలతో సేదదీర్చే ఆమె– నిండుకుండ!

నిరంతరంగా అభిమానధారల్ని కురిపించే జలపాతం!

తనకోసం తపించిపోయిన తన్మయి ప్రేమ– తన మనసంతా నిండి, 'ఆమె సాహచర్యం కంటే జీవితంలో ఇంకా కావాల్సింది ఏముంది?' అన్పించేది.

ఆమె ప్రభావ పరిమళంతో పులకించింది తన హృదయకుసుమం! తనూ ఎంతో అనుకున్నాడు ఆమె కావాలని. కానీ, అమ్మ తన్మయి తండ్రి గురించి మోసుకొచ్చిన వార్త అతని కృంగదీసి సందేహంలో పడేసింది. తన్మయి తల్లి గర్భంలో ఉండగా ఆమెను విడిచిపెట్టి వేరే వివాహం చేసుకున్నాడట ఆమె తండ్రి.

"కులం, గోత్రం తండ్రి తదితరం తెలియని అమ్మాయిని చేసుకుంటావట్రా? ఇంత బ్రతుకూ బ్రతికి నన్ను ఈ అప్రాచ్యాన్ని సహించమంటావట్రా?" అని తల్లి కంటతడి పెట్టేసరికి– తనూ తన్మయిని చేసుకోవడానికి విముఖత చూపించాడు. తను కుదిర్చిన గొప్పింటి గాయత్రిని చేసుకున్నాడు.

ట్రాన్స్‌ఫర్ మీద బెంగుళూరు వచ్చి తన్మయి జ్ఞాపకాలకు దూరం కావడానికి ప్రయత్నించాడు. కానీ, తటిల్లతలా హృదయాకాశంలో తన్మయి రూపం మెరుస్తూ తననెంతో మురిపించేది.

మిత్రుడు మనోహర్ దగ్గర పదేపదే ఆమె గురించి చెప్తూ వెలితి ఫీలవుతూనే ఉండేవాడు.

"అంతగా అభిమానించిన అమ్మాయిని వదులుకోవడానికి మనసెలా ఒప్పిందిరా?" అని వాడు కూడ బాధపడేవాడు. అంతలోనే తనంత సెంటిమెంటల్ ఫూల్‌లా వాడి మనసులో నిలిచిపోవడం ఇష్టంలేక తన సెన్సిటివ్‌నెస్‌ని కప్పిపుచ్చుకుంటూ-

"కానీ ఒక్క విషయం! నేను కనుక తన్మయిని చేసుకునివుంటే తనెంతో సుఖపడేది. ఎవడో గుమస్తాగిరి వెలగబెట్టేవాడ్ని చేసుకుందిట! వాడికి లేని వ్యసనం అంటూ లేదంటారు. అష్టకష్టాలు పడుతోందిట పాపం!" అని ఆమె జీవితం గురించి ఏవేవో కల్పించి చెప్పి తన 'మేల్‌ఈగో'ని ప్రదర్శించి సంతృప్తి చెందడానికి ప్రయత్నించేవాడు.

'తనను కావాలనుకున్న మనిషి- తనను పొంది, తన సాన్నిధ్యంలో అయితేనే సుఖపడగలదు గానీ... మరొకరిని మనువాడి ఏ విధంగానూ సుఖ సంతోషాల్ని పొందలేదు' అనుకుంటారు ఋష్విక్ లాంటి మగమహారాజులు. అలా అనుకుని అంతరాంతరాలలో ఫీలవుతున్న వెలితిని పూరించుకోవడానికి వృథాప్రయత్నం చేస్తుంటారు.

"గోదావరి స్టేషన్ వస్తోంది. సామాన్లు బెర్త్‌ల మీద నుండి త్వరగా దించండి. ఎక్కువసేపు ఆగదు" ప్రయాణికుల సంభాషణా కోలాహలంతో ఋష్విక్ జ్ఞాపకాల ధ్యానం చెదిరి, విండోలోంచి చూస్తే 'రాజమండ్రి ఆంధ్రా పేపర్ మిల్స్' అల్లంతదూరంలో అందంగా కన్పించింది.

ఇందులోనే కదా తన్మయి భర్త దీపక్ పనిచేస్తున్నాడు! నిజంగా అతను ఎటువంటివాడో? తను ఏవేవో ఊహించి, కల్పించి అతని గురించి మనోహర్ దగ్గర వాగుతుండేవాడు. ఏమిటో తనలో ఈ వింత ప్రవృత్తి?!

ఆమె తన ప్రేమను వ్యక్తం చేసినప్పుడు మొదట్లోనే కాదంటే సరిపోయేది. ఆ ప్రణయ మాధుర్యాన్ని మనసా, వాచా తను ఎంతగానో ఎంజాయ్ చేశాడు. 'ప్రేమిస్తేనే కదా ప్రేమ నిలిచేది?!' అన్నట్లు ఆ ప్రేమను నిలుపుకోవడానికి తహతహలాడుతూ ఏవేవో తీయటి కబుర్లు చెప్పాడు తను.

'ఆమె అపారమైన ప్రేమానురాగాలను పెంచుకుంది పాపం..! అకస్మాత్తుగా తను దూరమైనందుకు ఆ కోమల హృదయం ఎంత కలత చెందిందో?!' ఆలోచిస్తుంటే అతని అంతరంగం ఆర్ద్రమైంది. కళ్ళు నీటితో నిండాయి.

తన 'మనసు అద్దం'లో నిలిచిపోయిన బంగారు బొమ్మ... తన్మయి!

తనను మరచిపోవడానికి ఆమెకు ఎంతకాలం పట్టిందో?!

తనని, తన అందాన్ని ఎంతగానో ఆరాధించిన తన్మయిని వరించిన దీపక్ ఎలావుంటాడో? అతను తను ఊహించినట్లు నిజంగానే ఏ డ్రంకర్డో కాదుకదా?! తన్మయి నిజంగానే అష్టకష్టాలు పడడం లేదు కదా?! పూర్వంలాగే గలగలా మాట్లాడేస్తూ తమ ప్రేమ విషయం అతగాడితో చెప్పేసి తంటాలేవీ తెచ్చుకోలేదు కదా?!'

'ఛ! ఏమిటీ పాడు మనసు... ఇంత చెత్తగా ఆలోచిస్తోంది?!' అని చిరాకుపడుతూ సూట్‌కేసు దించుకుని ఆగబోతున్న ట్రైన్‌లోంచి దిగడానికి సిద్ధమయ్యాడు ఋష్విక్.

అరడుగులు వేశాడో, లేదో-

"హాయ్ ఋష్విక్! నువ్వు... ఇక్కడ..." అంటూ సంభ్రమాశ్చర్యాలతో సమీపానికి వచ్చిన తన్మయిని చూసి చకితుడయ్యాడు.

"వాటే ప్లెజెంట్ సర్‌ప్రైజ్ తన్మయీ?! నువ్వేనా..? బాగున్నావా? మీరు ఈ ఊళ్లోనే ఉంటున్నట్లు మీ ఫ్రెండ్ ద్వారా తెలిసింది. నేను ఇక్కడ సిటిఆర్ఐకి ఆఫీసు పనిమీద వచ్చాను" అని తడబడే మాటలతో గబగబా పలకరించాడు బుష్విక్.

"మా ఆడపడుచుకి సెండాఫ్ ఇద్దామని స్టేషన్‌కి వచ్చాను. బాగున్నావా బుష్విక్? రా... ఇంటికి వెళ్దాం!" అతన్ని ఒకసారి పరిశీలనగా చూసి, చిరునవ్వుతో అంది ఆమె.

"మీ ఇంటికా..? ఆఫీసు ఎకామిడేషన్ ఉంది తన్మయీ! అడ్రస్ చెబితే, తరువాత వచ్చి కలుస్తాను... సరేనా?" అన్నాడు టై సరిచేసుకుంటూ.

"అలా కాదు. నీ ఎకామ్‌డేషన్‌కి తరువాత తీసుకెళ్తానులే! ముందు మా ఆతిథ్యాన్ని స్వీకరించాల్సిందే!" అంది మధురంగా నవ్వుతూ.

అదే మాట తీరు.., అదే స్వచ్ఛత! వినిర్మలమైన వెన్నెల విరబూసినట్లుండే నవ్వు, పెళ్ళయి పదేళ్లయినా చెదిరిపోని రూపలావణ్యం!

ఆమెను చూస్తున్న అతనిలో ఓ దివ్యానుభూతి కలిగింది. ఏదో ఆత్మీయతా పరిమళం అంతరంగాన్ని స్పృశించి పునీతుడ్ని చేసింది.

"అయితే... మీ ఇంటికి రాక తప్పదంటావ్?!" అంటూ నవ్వి, ఆమెను అనుసరించాడు. ఆటో చేసుకుని అరగంటలో ఇంటికి వచ్చారు.

మధ్యాహ్నం 12 గంటలవుతోంది. స్నానం చేసి ఫ్రెషప్ అయి, తన్మయి ఇచ్చిన పుస్తకాలు తిరగేస్తూ కూర్చున్నాడు బుష్విక్.

కిచెన్‌లో బిజీగా వుంది తన్మయి!

ఇంతలో... హీరోహోండా రావడంతో ఆసక్తిగా గుమ్మంవైపు చూశాడు బుష్విక్.

గ్రే కలర్ ప్యాంట్ మీద స్కైబ్లూ టీషర్ట్ టక్ చేసిన ఆకర్షణీయమైన అతని రూపం వైపు ఒక్కక్షణం అలాగే చూస్తూండిపోయాడు.

అపరిచితమైన అతన్ని ఆశ్చర్యంగా 'ఎవరా...' అన్నట్లు చూశాడు దీపక్.

తన్మయి వచ్చి బుష్విక్‌ని పరిచయం చేసింది.

"చెప్తుంటానే... బుష్విక్ అనీ- ఇతనే!" అని, అతని వైపు చూసి- "బుష్విక్... మా పెళ్ళికి రావడానికి నీకు కుదరనే లేదు. ఇతనే నా హజ్బెండ్... దీపక్!" అంటూ ఒకింత గర్వంగా చెప్పింది తన్మయి.

"ఓం... మీరేనా బుష్విక్ అంటే?! గ్లాట్ టు మీట్ యూ! మీ గురించి చెప్తూవుంటుంది తనెప్పుడూ. తన్మయి జ్ఞాపకాలలో మిగిలిపోయిన మంచిఫ్రెండ్ మీరు!" అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు దీపక్.

చిరునవ్వుతో ఇద్దరినీ మార్చిమార్చి చూశాడు బుష్విక్.

అతని మనసంతా రకరకాల ఆలోచనలతో సందడి చేస్తోంది. 'తన గురించి భర్తకి చెప్పేసిందా? ఏం చెప్పిందో? కొంపదీసి తన ప్రేమ విషయమంతా చెప్పేయలేదు కదా! నన్ను ఏమనుకుంటాడో అతను?!' తలచుకుంటేనే కొంచెం ఇబ్బందిగా అన్పించింది బుష్విక్‌కి.

"లంచ్ చేద్దాం... రండి!" అంటూ డైనింగ్ హాల్‌వైపు నడిచింది తన్మయి.

కాళ్లూ చేతులు, ముఖం కడుక్కుని దీపక్ వచ్చేసరికి- వడ్డించడం మొదలుపెట్టింది.

తనకెంతో ఇష్టమైన కొబ్బరి తురిమివేసిన క్యారెట్ కర్రీని చూడగానే నవ్వుకుంటున్న బుష్విక్‌ని చూసి-

"ఇది మీ ఫేవరేట్ కర్రీ అని తన్మయి ఎప్పుడూ చెప్తూవుంటుంది. తన్మయి ఆలోచనల్లో ఎప్పుడూ చోటుచేసుకుంటుంటే మిమ్మల్ని చూడాలని ఎప్పటినుంచో అనుకుంటూ ఉండేవాడ్ని. ఇప్పటికి కలిసాం!" అంటూ కపటం లేకుండా మాట్లాడుతున్న దీపక్‌ని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది బుష్విక్‌కి. 'ఇటువంటివాళ్ళు కూడా ఉంటారా?' అన్పించేటంత మంచితనం!

"రియల్లీ యు ఆర్ లక్కీ దీపక్‌గారూ! తన్మయి లాంటి అరుదైన స్త్రీ సాన్నిహిత్యం కలగడం ఎన్నో జన్మల సుకృతం!" అన్నాడు.

"అవునండీ! హి ఈజ్ నాట్ ఓన్లీ మై వైఫ్. బట్ ఆల్సో ఏ గైడ్ అండ్ ఫిలాసఫర్! మా బంధువు లందరికీ కూడా తనంటే చాలా అభిమానం!"

"చాల్లే దీపక్! ప్రయాణపు బడలికతో ఉన్నాడు... అతన్ని కాస్త తిననీ! ఆఁ... అన్నట్లు- గుర్తొచ్చింది... ఈవెనింగ్ నేను స్కూల్‌కి వెళ్లను. నువ్వే ఆఫీసులో ఓ గంట పర్మిషన్ తీసుకుని నాలుగు గంటలకల్లా పిల్లల్ని తీసుకొచ్చేయి. సరదాగా బుష్విక్‌తో ఎటన్నా పోయివద్దాం! మళ్లీ రేపట్నించి అతను ఆఫీసు పనితో బిజీ అయిపోతాడు" అంది తన్మయి.

భోజనం పూర్తిచేసి డ్రాయింగ్ రూంలోకి వచ్చారు ఇద్దరూ.

మళ్లీ ఫ్యాక్టరీకి బయలుదేరబోతూ "అయితే మీరు కాసేపు రెస్ట్ తీసుకోండి! నేను పిల్లలతో నాలుగింటికల్లా వస్తాను. మీ పిల్లలు ఏం చదువుతున్నారు?

నవ్వుతూ చెప్పాడు క్లుప్తంగా బుష్విక్. రెండుమాటలు ఎక్కువ మాట్లాడాలంటే మొదటినుంచీ అంతే తనకు! ప్రతి విషయంలోనూ సంకోచం, అనుమానం, భయం!

బుష్విక్ గుండె మూగగా రోదించింది.

ఆ తీయని రోజులు అవ్యాజమైన అనురాగంతో తనంటే ప్రాణం పెట్టి ఆమె మాట్లాడిన మాటలు, అపారంగా ప్రేమించి ప్రేమింపజేసుకున్న ఆ కోమల హృదయం, తను ఆమెతో కలబోసుకున్న కమ్మని కబుర్లు, అకస్మాత్తుగా ఆమెకు దూరమైన సంఘటన... అన్నీ సినిమా రీలులా కళ్ళముందు కదులుతుంటే.., మనసును తీరని వ్యధకు గురిచేస్తుంటే- 'తన్మయీ... ఎందుకంతగా ఈ వివేకహీనుడ్ని ప్రేమించావు? మళ్లీ ఇప్పుడెందుకిలా కలిశావు?' అనుకుని బాధగా నిట్టూర్చాడు బుష్విక్.

"ఏమిటీ... గుమ్మంలో నిలబడి దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టున్నావు?" అంటూ వచ్చింది తన్మయి.

"తన్మయీ! నన్ను క్షమిస్తావు కదూ?" అన్నాడు గాద్గదికంగా.

"ఏమిటీ... ఉన్నట్టుండి ఇలా అప్‌సెట్ అయిపోయావు? జీవితం అన్న తరువాత ఏవో జరుగుతూ ఉంటాయి. జరిగినదానికి బాధపడి ప్రయోజనం ఏమిటి చెప్పు? ఇంతకాలానికి నిన్ను చూడగలగడం నిజంగా చాలా ఆనందంగా ఉంది."

"నీకా రోజులు తలచుకుంటుంటే బాధగా లేదా తన్మయీ? నేనంటే నీలో ఏమాత్రం కోపం లేదా?"

"బాధెందుకు, కోపమెందుకు? 'ప్రేమించా'నంటూ వెంటపడింది నేనేగా!"

"నేనూ ప్రేమించానంటూ కబుర్లు చెప్పానుగా! నీ పుట్టుపూర్వోత్తరాల గురించి అమ్మ చెప్పిన మాటలు విని ఉన్నట్టుండి నీకు దూరమయ్యాను. ఆనాడు నీ మనసు ఎంత క్షోభించిందో కదా!" అన్నాడు రుద్ధకంఠంతో.

"అవును... ప్రేమించి మనసును పరిచాను. త్రొక్కి వెళ్లిపోయావని విలవిలాడాను. శూన్యంలో బ్రతికినట్లు బ్రతికాను. అప్పుడే అమ్మఫ్రెండ్ కొడుకు దీపక్ నన్ను ప్రేమించానంటూ వచ్చాడు. కాదనడానికి కాస్త ఆలోచించాను. నీపట్ల వ్యామోహంతో మనోదౌర్బల్యాన్ని పెంచుకుని కృశించిపోవడం- చదువు, వ్యక్తిత్వం కలిగిన నేటి ఆడపిల్లగా నా మనసు ఇష్టపడలేదు. అందుకే 'సరే'నన్నాను. అతనితో జీవితం అనందమయమై నా మనసులో బాధ తొలగిపోవడానికి ఎంతోకాలం పట్టలేదు. అతని చల్లని మాట, స్నేహం నన్నెంతో సేదదీర్చాయి.

క్రమంగా మన పరిచయం గురించి కూడా అతనికి చెప్తేగానీ- నా మనసు సమాధాన పడలేదు. నోటితో చెప్పలేని నా మనోగతమైన ఎన్నో సున్నిత భావాలను కూడా చక్కగా అర్థంచేసుకున్న సహృదయుడు దీపక్. మానవత్వంతో పరిమళించిన అతని అపురూపమైన స్వభావం నాలో చెలరేగే భిన్నభిన్న భావాలను అరికట్టి అంతరంగాన్ని శాంతిమయం చేసింది. కాబట్టి గతాన్ని గురించి బాధపడడంగానీ, నీపట్ల కోపంగానీ ఏమీ లేవు ఇప్పుడు నాలో! ఫ్రీగా మాట్లాడుకుందాం!" అంది తన్మయి నిర్మలంగా.

ఆమె మాటలు అతని మనసును ఎంతగానో ఆనందపరిచాయి.

కాసేపు అతన్ని రెస్టు తీసుకోమని చెప్పి అక్కడినుండి కదిలింది సజీవ శిల్పంలా.

• • •

ధవళేశ్వరం బ్యారేజ్‌పై నిలబడి, ఉప్పొంగి ఉరికే గోదావరి పరవళ్ళను కనులారా వీక్షిస్తున్నారు.

అలుపెరుగని ఆ జీవనది నిరంతరం ప్రవహిస్తూ జనజీవనంలో అంతర్భాగమై నిలిచి, వారికి ప్రాణాధారమైంది. అతని దృష్టిలో తన్మయి తన జీవనది! అక్కడి నుంచి కడియంలోని పూలతోటలను చూస్తూ వస్తున్నారు.

"అంకుల్! ఆ తోటలో ఆ పున్నాగచెట్టు క్రింద కూర్చుందామా?" అని పాప పల్లవి, "వద్దు గుల్‌మొహర్ ట్రీస్ చూడండి అంకుల్... ఎంత బావున్నాయో! అక్కడికి వెళ్లి కూర్చుందాం... సరేనా మమ్మీ!" అంటూ బాబు చిరునగవు లొలికాడు.

తన్మయి, దీపక్‌ల ప్రేమనంతా కలబోసుకుని పరిమళించిన రెండు మనోహరమైన పుష్పాలను చూస్తున్నట్లనిపించింది బుష్పిక్‌కి.

అల్లంత దూరంలో గలగలా ప్రవహిస్తున్న గోదావరి కనబడుతోంది. స్నేహబంధాన్ని సజావుగా నిర్మించిన తన్మయిని తన జీవితకాలంలో మరచిపోగలడా? నెవ్వర్! ఆమె ఆ తల్లిగోదారిలా నిరంతరం ప్రవహించే జీవనది.

చెరోవైపు చేరిన పిల్లల చిన్నారి చేతుల్ని పట్టుకుని అటువైపు నడిచాడు బుష్పిక్.